# వాస్తవం

బుధవారం 29.04.2026

డిజిటల్ పత్రిక

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)



జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


# భవిష్యత్ తరాలకు ఫ్యూచర్

**మరో పదేళ్లు రాష్ట్రాన్ని దోచుకుందామనుకున్నారు**

**అధికారం లాక్కున్నానని ఆ కుటుంబం పెడబొబ్బలు**

**ఏడుస్తూనే ఉండండి.. నా పని చేసుకుంటూ పోతా**

**ఫ్యూచర్ సిటీని సింగపూర్, టోక్యోల రేంజ్‌కి తీసుకెళ్తా**

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు**

**ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు శంకుస్థాపన**

**వాస్తవం : హైదరాబాద్**

ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలోని ఆదర్శ నగరాలతో పోటీపడేలా నిర్మిస్తున్నామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులందరూ ఈ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఇదే సందర్భంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ భవనం, అక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను రిమోట్ పద్ధతిలో ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏ నగరానికీ లేని సదుపాయాలు, మౌలిక వసతులు హైదరాబాద్‌కు ఉన్నాయని దీంతో ఇక్కడ అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీని సింగపూర్, టోక్యో, న్యూయార్క్‌ల్లా అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఫార్చ్యూన్-500 కంపెనీలు భారీ పెట్టుబడులతో ముందుకు వస్తున్నాయని తెలిపారు. పడనోళ్లు, నచ్చనోళ్లు కడుపు నొప్పితో ఎద్దేవా మాటలు మాట్లాడుతున్నారని సీఎం చెప్పారు. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి.. నేను చేసుకుంటూనే పోతానే ఉంటా అని విపక్షాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అధికారం పోయిందని కేసీఆర్ కుటుంబం పెట్టే పెడబొబ్బలు తన చెవులో సంగీతం వినిపించినట్లు ఉంటుందని చెప్పారు. ఇంకో 10, 20 ఏళ్లు రాష్ట్రాన్ని దోచుకుందామని కలలు కన్నారని, అర్థంతరంగా రైతు బిడ్డ వచ్చి గుంజుకుపోయాడనే బాధ కేసీఆర్ కుటుంబంలో ఎక్కువైందని వ్యాఖ్యానించారు. లోక కళ్యాణం కోసం ఎవరైనా యాగాలు చేస్తుంటే శుక్రాచార్యుడు మారీచుడు, సుబాహుడనే రాక్షసులను ఊరి మీదకు వదిలి యాగాల్లో రక్తం, మాంసాలు వేయించి అడ్డుకునే వాడని వ్యాఖ్యానించారు. ఫామ్ హౌస్‌లో ఉన్న శుక్రాచార్యుడు ఇద్దరిని జనంలోకి వదిలాడని కేటీఆర్, హరీశ్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో భాగంగా నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని సీఎం తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు ఎప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటారని చెప్పారు. మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాన్ని జూన్ 2లోగా ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.



## తెలంగాణ

# కొత్త డీజీపీగా సీవీ ఆనంద్

హైదరాబాద్, ఏప్రిల్ 28: తెలంగాణ కొత్త డీజీపీగా సీవీ ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యూపీఎస్సీ ఎంపానెల్ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రస్తుతం సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన డీజీపీగా ప్రమోషన్ పొందనున్నారు. ఈ బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఈ నియామకం అమల్లోకి వస్తుంది. తెలంగాణ ప్రస్తుత డీజీపీ కె. శివధర్ రెడ్డి ఏప్రిల్ 30వ తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ పోలీస్ బాస్‌గా సీవీ ఆనంద్ నియమితులయ్యారు.ఏప్రిల్ నెలాఖరులో ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి పదవి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కొత్త డీజీపీ ఎంపిక అనివార్యమైంది. అందుకు రాష్ట్రంలోని సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్ల జాబితాను ఇటీవల యూపీఎస్సీ..



రాష్ట్ర ప్రభుత్వం పంపింది. ఆ జాబితాలో 1991 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యా మిశ్రా ఉన్నారు. వారిలో సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీగా ఎంపిక చేసింది.



# నేడే పది పరీక్షా ఫలితాలు

**ఈసారి వాట్సాప్‌లోనూ విడుదల**

**హైదరాబాద్:** పదో తరగతి పరీక్షా ఫలితాలు నేడు వెల్లడికానున్నాయి. మధ్యాహ్నం 2 గంటలకు రిజల్ట్ వెల్లడించున్నారు. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మార్చి 14వ తేదీన పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 13వ తేదీన పరీక్షలు పూర్తయ్యాయి. సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. ఈ నెల 23వ తేదీతో జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయ్యింది. మే మొదటి వారంలో ఫలితాలు వెల్లడించాలని ముందుగా భావించినప్పటికీ.. దాని కంటే ముందు ఫలితాల వెల్లడించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు.పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ ఏడాది వాట్సాప్ లోనూ తెలుసుకోవచ్చు. ఎస్సెస్సీ బోర్డు ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటికే హాల్‌టికెట్లను సైతం వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే వెసులుబాటు కల్పించిన బోర్డు తాజాగా ఫలితాలను సైతం వాట్సాప్ ద్వారా తెలుసుకొనే వీలు కల్పించింది. వాట్సాప్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొన్న వారి మొబైల్ నంబర్‌కు ఆటోమెటిక్‌గా మెమో వెళుతుంది.డౌన్‌లోడ్ చేసుకోని వారు మాత్రం.. 80969 58096 నంబర్‌కు 'హాయ్' అని సందేశం పంపించాలి. ఆ తర్వాత ఎస్సెస్సీ రిజల్ట్స్ అని టైప్‌చేసి హాల్‌టికెట్ నంబర్, ఇతర వివరాలు నమోదుచేయాలి. ఆ తర్వాత ఫలితం స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతుంది.

# దూబే, ఫెరీరా విధ్వంసం

**పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్**

పంతొమ్మిదో సీజన్‌లో భారీ లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తూ అజేయంగా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్‌కు షాకిచ్చింది రాజస్థాన్ రాయల్స్. ఆరు విజయాలతో టేబుల్ టాపర్‌గా కొనసాగుతున్న పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపించింది. 223 లక్ష్య ఛేదనలో యశస్వీ జైస్వాల్(51), వైభవ్ సూర్యవంశీ(43)లు మెరుపు ఆరంభమివ్వగా.. డొనొవాన్ ఫెరీరా(52 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ శుభం దూబే(31 నాటౌట్)లు డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఆరో విజయంతో మూడో స్థానానికి దూసుకెళ్లింది రాజస్థాన్. ఐపీఎల్-19లో పంజాబ్ కింగ్స్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తున్న పంజాబ్‌కు సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ ఊహించని పంచ్ ఇచ్చింది. ముల్లన్‌పూర్‌లో నిర్దేశించిన 223 పరుగుల ఛేదనను రాజస్థాన్ రాయల్స్ ధాటిగా మొదలెట్టింది. తొలి ఓవర్లోనే అర్ష్‌దీప్ సింగ్‌కు చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(43) 6, 4, 4 బాదాడు. అనంతరం యాన్సెన్, ఫెర్గూసన్ ఓవర్లోనూ వైభవ్ విధ్వంసంతో 20 బంతుల్లోనే 51 పరుగులు చేసింది రాజస్థాన్.అర్ధ శతకానికి చేరువైన వైభవ్ ఆ తర్వాతి బంతికే అయ్యర్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్‌ను చాహల్ ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు. కాసేపు షాట్లతో అలరించిన యశస్వీ జైస్వాల్‌ను సైతం వెనక్కి పంపిన చాహల్.. కెప్టెన్ రియాన్ పరాగ్‌ను పెవిలియన్ చేర్చాడు. చాహల్ వేసిన 14వ ఓవర్లో తొలి రెండు బంతుల్ని 6, 4 గా మలిచిన పరాగ్ చివరి బంతికి బౌటయ్యాడు. వెంట వెంటనే వికెట్లు పడినా ఇంప్యాక్ట్ సబ్‌గా వచ్చిన శుభమ్ దూబే(31 నాటౌట్) డొనొవాన్ ఫెరారా(52 నాటౌట్)లు అదరలేదు. గెలుపు బాధ్యత తీసుకున్న ఈ జోడీ పంజాబ్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. అర్ష్‌దీప్ వేసిన 18వ ఓవర్లో ఫెరీరా 6, 4.. చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపగా




మ్యాచ్ రాజస్థాన్ వైపు మళ్లింది. 12 బంతుల్లో 18 రన్స్ అవసరమైన వేళ.. ఫెర్గూసన్ బౌలింగ్‌లో 4, 6 బాదిన ఫెరీరా పంజాబ్ ఓటమిని ఖాయం చేశాడు. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ఫెరీరా.. రాజస్థాన్‌కు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు. పంజాబ్ కింగ్స్ ముల్లన్‌పూర్ భారీ స్కోర్ కొట్టింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్(59) ఎప్పటిలానే శుభారంభమివ్వగా.. కూపర్ కొన్నొ లీ(30), కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్(30)లు దంచేశారు. డెత్ ఓవర్లలో మార్కస్ స్టోయినిస్(62 నాటౌట్) సిక్సర్ల మోతతో పంజాబ్ స్కోర్ 200 దాటింది. బ్రిజేశ్ శర్మ వేసిన చివరి ఓవర్లో 4, 6 , 6 తో అర్ధ శతకం సాధించిన స్టోయినిస్ చివరి రెండు బంతుల్నీ బౌండరీ దాటించాడు. దాంతో, పంజాబ్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగులు చేసింది.


జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110





## రక్షణ రంగంపై

# అత్యధికంగా ఖర్చు చేస్తున్న ఐదో దేశంగా భారత్

**ఢిల్లీ:** ప్రపంచ దేశాల్లో రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చు చేస్తున్న దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. గడిచిన ఏడాది (2025)లో మన దేశం రక్షణ రంగంపై 92.1 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అమెరికా, చైనా , రష్యా , జర్మనీ దేశాలు ఈ జాబితాలో భారత్ కంటే ముందు స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు స్టాక్‌హోమ్ అంతర్జాతీయ శాంతి పరిశోధక కేంద్రం తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది. 2025లో ప్రపంచవ్యాప్తంగా రక్షణ వ్యయం 2.9% పెరిగి 2,887 బిలియన్ డాలర్లుగా ఉందని ఆ నివేదిక తెలిపింది. ఇక 2025లో భారత్ తన రక్షణ వ్యయాన్ని 92.1 బిలియన్ డాలర్లకు పెంచింది. ఇది 2024 కంటే 8.9% అధికమని పేర్కొన్నది. దాంతో ప్రపంచ వ్యాప్తంగా రక్షణ రంగంపై అత్యధికంగా ఖర్చుచేసే దేశాల జాబితాలో భారత్ ఐదో స్థానంలో నిలిచింది. ఇక రక్షణ రంగం కోసం 954 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తూ అమెరికా అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత 336 బిలియన్ డాలర్ల వ్యయంతో చైనా రెండో స్థానంలో ఉన్నది.ఇక ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో 190 బిలియన్ డాలర్ల ఖర్చు తో రష్యా మూడో స్థానంలో, 114 బిలి



యన్ డాలర్ల ఖర్చుతో జర్మనీ నాలుగో స్థానంలో ఉన్నాయి.. కాగా పాకిస్థాన్ కూడా తన రక్షణ వ్యయాన్ని 11 శాతం పెంచింది. 11.9 బిలియన్ డాలర్లతో ఈ జాబితాలో 31వ స్థానంలో ఉన్నట్లు వెల్లడించింది.

# దక్షిణాదిపై వివక్ష అనేది తప్పుడు ప్రచారం

**అన్ని రంగాల్లో దక్షిణాదికి భారీ పెట్టుబడులు**

**బుల్లెట్ రైళ్ల ద్వారా దక్షిణాది ముఖ చిత్రం మారబోతుంది**

**అమరావతి నుంచి హైదరాబాద్‌కు 70 నిమిషాల్లో బుల్లెట్ ట్రైన్**

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**

**అమరావతి** : బుల్లెట్ రైళ్ల ద్వారా దక్షిణాది ముఖ చిత్రం మారబోతుందని కేంద్ర అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ జిల్లా తర్లువాడలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.బుల్లెట్ ట్రైన్ ద్వారా అమరావతి, హైదరాబాద్ , చెన్నై, బెంగళూరు మధ్య కనెక్టివిటీ పెరగబోతుందని వివరించారు. అమరావతి నుంచి హైదరాబాద్‌కు కేవలం 70 నిమిషాల్లో చేరుకోవచ్చని వెల్లడించారు. దక్షిణాది పట్ల వివక్ష ఉందని విపక్షాలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని తెలిపారు.రైల్వేలు, హైవేలు, విద్యుత్, పోర్టులు అన్ని రంగాల్లో దక్షిణాదికి భారీ పెట్టుబడులు వస్తున్నాయని మంత్రి అన్నారు. గతంలో ఉమ్మడి ఏపీలో కేవలం రూ.8 వందల కోట్లు మాత్రమే రైల్వే



నిధులు వచ్చేవని, ప్రస్తుతం ఒక్క ఏపీకే రూ.10 వేల కోట్లకు పైగా నిధులు వస్తున్నాయని వివరించారు. జూన్ 1న దక్షిణా కోస్తా రైల్వేజోన్ ప్రారంభమ వుతుందని వెల్లడించారు.

# మొబైల్ ఫోన్ల అధిక వినియోగంతో పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకం




**వాస్తవం: మాడుగులపల్లి :** ప్రజా పాలనలో భాగంగా మండల వ్యాప్తంగా అన్ని అంగన్వాడి కేంద్రాలలో సమ భావన సంఘాలు,స్త్రీ శిశు సంక్షేమ వారితో కలిసి సంయుక్తంగా ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ భవనంలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో వంశీధర్ ,స్థానిక సర్పంచ్ ఆరూరి నరేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ 14 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వరకు వయసు అత్యంత కీలకమైనదని కాబట్టి పిల్లలకు మొబైల్ ఫోన్ ఇవ్వడం ఎక్కువగా ఫోన్ వాడి రకరకాల యాప్‌లు చూడడం వల్ల వారు ఎన్నో నేరాలకు అఘాయిత్యాలకు చెడు అలవాట్లకు గురవుతారని దానిద్వారా వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని అందువల్ల తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్లు అలవాటు చేయవద్దని అన్నారు. ఉపాధి హామీ దగ్గర తల్లులకు ఆర్ బి ఎస్ కే డాక్టర్ రవి మాట్లాడుతూ చిన్నప్పటినుండి పిల్లలకి సరైన పోషణ రక్షణ ఇవ్వాలని అన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ జి లక్ష్మి, జె నాగమణి, సి సి రమణి మాట్లాడుతూ పిల్లలకు 14 సంవత్సరాల వయసు రాగానే పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా ఉండి తన అభిప్రాయాలు చెప్పే విధంగా తల్లిదండ్రులు ఉండాలని బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ బాలికల తల్లిదండ్రులు, అంగన్వాడి టీచర్స్, ఆశాలు, కార్యదర్శులు, సంఘ బంధం వివోలు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సంఘ బంధం అధ్యక్షురాలు, తదితరులు పాల్గొన్నారు.

# మన ఇసుక వాహనం పెండింగ్ బిల్లులు చెల్లించాలి

## ట్రాక్టర్ యజమానుల వేడుకోలు



**వాస్తవం : తిరుమలగిరి**

తిరుమలగిరి మండల పరిధిలోని మన ఇసుక వాహనం ద్వారా ఇసుకను సరఫరా చేస్తున్న ట్రాక్టర్‌ల యజమానుల గోస వర్ణనాతీతంగా మారింది. ఇసుక లోడ్ చేసిన లేబర్ ఖర్చులు, డీజిల్ ఖర్చులు, డ్రైవర్ల జీతాలు, ట్రాక్టర్ల కిస్తీలు, రోడ్డు టాక్స్ లు, ఇన్సూరెన్స్‌లు, రిపేరింగ్‌లు ఇలా చెప్పుకుంటూపోతే అనేకం ఇబ్బందులున్న పడుతున్న పరిస్థితి చూడవచ్చును. ట్రాక్టర్ యజమానులు సాండ్ టాక్స్ పేరున ముందుగానే ప్రభుత్వానికి కొంత ఫీజు డిపాజిట్ చేసారన్నది వాస్తవం. అప్పులు చేసి సాండ్ టాక్స్ ఫీజు కట్టమని ట్రాక్టర్ యజమానులు ఆవేదన వ్యక్తం చేసారు. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని పై ఆర్డీఓ, ఎమ్మార్వోకు పలుమార్లు విన్నవించినా పరిస్థితి మారడం లేదన్నారు. పరిస్థితి ఇలానే ఉంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ట్రాక్టర్ యజమానులు వేడుకుంటున్నారు.

# డ్రగ్స్ దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగంతో దుష్ప్రభావాలపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సంబంధిత అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో డీ అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభించామని, డ్రగ్స్ బాధితులకు చికిత్స, కౌన్సెలింగ్ పూర్తి స్థాయిలో అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. గంజాయి అరికట్టేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, అదే సమయంలో డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖ, వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రచారం చేస్తున్నామన్నారు. వివిధ షాపులలో నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేస్తున్నామని ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష పేర్కొన్నారు.ఈ సమావేశంలో సిరిసిల్ల ఆర్ డిఓ వెంకటేశ్వర్లు,ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్ రజిత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, ఫుడ్ ఇన్స్పెక్టర్ అనూష, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.





# ఉపాధి హామీ కూలీలకు కూల్ వాటర్ క్యాన్ల పంపిణీ

## సర్పంచ్ బొబ్బిలి కావ్య శ్రీనివాస్ యాదవ్



**వాస్తవం : మాడుగులపల్లి:**

మండల పరిధిలోని గంద్రవాణిగూడెం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ కూలీలకు ఎండ తీవ్రత ఎక్కువ ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారని స్థానిక సర్పంచ్ బొబ్బిలి కావ్య శ్రీనివాస్ యాదవ్ ఉపాధి హామీ కూలీలకు కూల్ వాటర్ క్యాన్లను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కళావతి సత్యనారాయణ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కర్ర శ్రీనివాస్ రెడ్డి,వార్డు మెంబర్లు బొబ్బిలి వంశీ,బొబ్బిలి హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాటరీల దొంగలను పట్టుకున్న పోలీసులు

**వాస్తవం : మందమర్రి:**



మందమర్రి సిఐ పి.రమేష్ కథనం ప్రకారం తేదీ 25. 04.2026, సాయంత్రం 6:00 గంటల సమయంలో సింగరేణి ఏరియా స్టోర్స్ లోని బ్యాటరీలు దొంగతనానికి గురి అయ్యాయని ఫిర్యాదు అందగా పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం 9 గంటల సమయం నందు మందమర్రి ఎస్సై జి. నరేష్. నరేష్ తన సిబ్బందితో వెళ్లి నార్లాపూర్ గ్రామం దగ్గర హైవే పైన వెహికల్ చెకింగ్ చేస్తుం డగా ఒక ఆటో పోలీసులను చూసి అనుమానస్పదంగా వెనుకకు తిప్పుకొని పారిపోయే ప్రయత్నం చేయగా..పోలీసులు వాళ్లని అడ్డుకొని విచారించగా ఆటో లో 25 బ్యాటరీలు లభించాయి. ఇవి ఎక్కడివి అని విచారించగా.. ఆటోలో ఉన్న ముగ్గురు వ్యక్తులైన ధనకుంట్ల ముని యప్ప ,జన్నే నరేంద్ర , గాజుల శివప్రసాద్ అను వ్యక్తులు ఆటోలో ఉన్నటువంటి బ్యాటరీలని సింగరేణి ఏరియా స్టోర్స్‌లో బ్యాట రీలను దొంగతనం చేసినారని తెలిపారు, వెంటనే వారిని పోలీస్ స్టేషన్ కి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించనైనది.మందమర్రి సిఐ నేరస్తులను పట్టుకున్న మందమర్రి ఎస్ఐ నరేష్‌ను, సిబ్బంది రాకేష్, మహేష్, కృష్ణ, శ్రీనివాస్‌ను అభినందించారు.




# ప్రతి ఒక్కరు తమ హక్కులను తెలుసుకోవాలి

## లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు

**వాస్తవం: గంభీరావుపేట**

ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకొని చట్టపరమైన రక్షణ పొందాలని లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాది ఆడెపు వేణు కోరారు.గంభీరావుపేట మండలంలోని సముద్ర లింగాపూర్ గ్రామంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి నీరజ ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి,కార్యదర్శి,పి లక్ష్మణాచారి సమన్వయంతో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా ఆడెపు వేణు మాట్లాడుతూ... సమాజంలో ప్రతి ఒక్కరికి న్యాయం అందేలా న్యాయ సేవా సంస్థలు నిరంతరం కృషి చేస్తున్నాయని తెలిపారు. ఈ సదస్సులో లోక్ అదాలత్ సభ్యులు గుర్రం ఆంజనేయులు, న్యాయవాదులు కుంట శ్రీనివాస్, రాజ్ కుమార్, తవుటు మధుసూదన్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ పాల్గొన్నారు.



# పెట్రోల్, డీజిల్ కొరత

**సామాన్యుల సతమతం**
**వరి కోతల సమయంలో**
**రైతన్నల అరిగోస**
**బంకుల్లో జనం బారులు**

**వాస్తవం : తిరుమలగిరి**

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా తీవ్రమైన పెట్రోల్ డిజిల్ కొరత ఉందన్నది వాస్తవం. తిరుమల గిరి మండలంలో బంక్ ల ముందు నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్ డీజిల్ కొరత వలన సామాన్యుల నెత్తిన అదనపు భారం పడుతుందన్నది వాస్తవం. వరి పంట కోతల సమయం కావడంతో ఇంధన కొరత రైతుల పాలిట శాపంగా మారింది. హార్వెస్టర్ నిర్వాహకులు గతంలో ఒక రోజులో పది నుంచి పద్నాలుగు గంటలు కోసే పరిస్థితి నుండి డీజిల్ లేక నాలుగు అయిదు గంటలకే పరిమితమైయ్యారు. దీంతో రోజు రోజుకు రైతుల పంట కోతల సమయం ఆలస్యమవుతున్నది. పెట్రోల్, డీజిల్ వచ్చిందనగానే వాహ నదారులు, వ్యాపారులు బంకుల ముం దు బారులు కడుతున్న దృశ్యాలు అనే కం. వాహనాలలోనే కాకుండా క్యాన్, డ్రమ్ములలో వారి వారి ఇష్టానుసారంగా తీసుకెళ్తున్న



పరిస్థితి. అయితే దళారులు ఇదే అదునుగా బ్లాక్ మార్కె ట్‌లో లీటరకు ముప్పై రూపాయలు అదనంగా అమ్ము తున్న పరిస్థితి. ఆయిల్ సంస్థలు వివిధ బంకులకు సరిపడు ఇందనం సరఫరా చేస్తున్నా గాని, స్టాక్ అయిపోతే మళ్ళీ మాకు దొరుకుతుందో లేదోనని అను మానంతో ప్రజలు తమ అవసరాలకు మించి పెట్రోల్, డీజిల్ ను కొనుగోలు చేయడంతో స్టాక్ త్వరగా అయిపోతుం దని బంకు నిర్వాహకులు చెబుతున్నా రు. పరిస్థితి ఇలానే కొనసాగితే ఇం ధనం నిల్వలు తగ్గిపోయి రేట్లు పెరిగే ప్రమాదం ఉన్నదని మేధావి వర్గం అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉం డగా వివిధ ఆయిల్ కంపెనీలు బడా వ్యాపారులతో చేతులు కలిపి ఇందనం కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కె ట్‌కు తరలిస్తున్నారని వాదనలు వినిపి స్తున్నాయి.

**పెట్రోల్ డీజిల్ కొరత ప్రభుత్వానిదే బాధ్యత**



ఇందన కొరతతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జనసేన పార్టీ తిరుమలగిరి మండల నాయకులు గంట లక్ష్మన్ అన్నారు. ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉందని డీజిల్ కొరత వలన హార్వెస్టర్లు, ట్రాక్టర్ లు అందుబాటులో లేక పంటలు కోయలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్రంలో పెట్రోల్ డీజిల్ కొరత లేకుండా చూడాలని కోరారు.

# నేరాల నియంత్రణలో పెట్రోకార్,బ్లూ కోల్ట్ వాహనాల కీలక పాత్ర

**పోలీస్ వాహనాల కోసం**
**నూతనంగా నిర్మించిన షెడ్**
**ప్రారంభించిన ఎస్పీ మహేష్ బి గితే**

**వాస్తవం : సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో పోలీస్ వాహనాల పార్కింగ్, సంరక్షణ కోసం నూతనంగా నిర్మించిన షెడ్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే మంగళవారం అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని పోలీస్ స్టేషన్ ల కు కేటాయించిన పెట్రోకార్ వాహనాలను తనిఖీ చేసి వాహనాల నిర్వహణపై ఆరా తీసారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతు జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా నేర సమా చారం అందిన వెంటనే పోలీస్ బృం దాలు బ్లూ కోల్ట్, పెట్రోకారు ద్వారా చేరుకొని క్షేత్ర స్థాయిలో అవాంఛనీయ సంఘట



నలు జరగకుండా,ప్రజలకు రక్షణ కల్పి స్తున్నాయన్నారు. ప్రజలకు తలెత్తుతున్న సమస్యలకు తక్షణమే స్పందించి సత్వర సేవలు అందించేందుకు రాష్ట్ర పోలీస్ శాక నుండి కేటాయించబడిన పెట్రో కార్, బ్లూ కోల్ట్ వాహనాల నిర్వహణపై అధికారులు ప్రత్యేక జాగ్రతలు తీసు కోవాలన్నారు.వాహనల డ్రైవర్లు వాహ నాలను ఎప్పటికప్పుడు కండిషన్‌లో ఉండేలా చూసుకోవాలని అప్పుడే ఘట న స్థలానికి సకాలంలో చేరే అవకాశం ఉంటుందన్నారు.అనంతరం అధికా రులతో ఎస్పీ కలిసి వాహనాల షెడ్ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు,సిఐలు, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మృతదేహం లభ్యం

**వాస్తవం: సిరిసిల్ల**

గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం సిరిసిల్లలోని కొత్త బస్ స్టాండ్ వద్ద మంగళవారం లభ్యమైంది. మృతుని వయస్సు అందాద 40-45 వరకు ఉంటుంది. అతడు 5'.6" ఎత్తు, గుండ్రటి ముఖం, చామనచాయ రంగులో ఉండి, దుస్తువులు ఎరుపు రంగు చొక్కా , గ్రీన్ రంగు ప్యాంటు, గ్రీన్ కలర్ బనియన్ దరించాడు. ఎడమ చేతిపై సుజాత అని కుడి చేతిపై ఎస్ ఎస్ అని పచ్చబొట్టు కలవు.శవంను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరచనైనదని, ఎవరికైనా ఆచూకి తెలిస్తే ఈ క్రింది నెంబర్ కి తెలుప గలరని సిరిసిల్ల పట్టణ సిఐ శ్రీనివాస్



ఫోన్ నెంబర్ 8712656366 తో సమాచారం ఇవ్వాలని కోరారు.

## శ్రీ మోహిని కుంట మల్లికార్జున స్వామి ఆలయ భూమి కబ్జా

**ఆలయ భూమి సర్వే చేసి హద్దు నిర్ధారించాలి**



**వాస్తవం : చందుర్తి**

చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని శ్రీ మోహిని కుంట మల్లికార్జున స్వామి ఆలయం భూమి కబ్జాకు గురైనట్లు విశ్వసనీయమైన సమాచారం. ఆలయానికి 412 సర్వే నంబర్ లో మూడు ఎకరాల 20 గుంటల భూమిని కేటాయించారు. ఆలయానికి ప్రతినిత్యం వచ్చే భక్తులకు స్థలం కొరతతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఆలయం భూమిని కొందరు దొంగచాటుగా కబ్జా చేసుకుని అన్యాక్రాంతం చేసి సాగు చేస్తున్నారని భక్తులు, గ్రామస్తులు అంటు న్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న శ్రీ మోహిని కుంట మల్లి కార్జున స్వామి ఆలయానికి కేటాయించిన భూమిని అలాగే ఉండేలా రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దులు చూపించాలని ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ చేసిన సర్పంచ్



**వాస్తవం : రామగిరి**

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందిన బెజ్జాల లింగయ్య కుటుంబాన్ని స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమా పీవీ రావు పరామర్శించారు.ఈ మేరకు 50 కిలోల బియ్యాన్ని అందచేశారు.మృతుని కుటుం బాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కోవూరు సురేష్,బోగే సతీష్,బెజ్జాల రాములు,బెజ్జాల రాజేందర్,బెజ్జాల ప్రేమ్ చంద్,ఆవుల సతీష్‌లు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

**తహసిల్దార్ మారుతి రెడ్డి**



**వాస్తవం : గంభీరావుపేట**

కొనుగోలు కేంద్రాలలో రైతులకు వేసవి దృశ్య ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సీసీలకు, సెంటర్ ఇన్చార్జ్ లను తాసిల్దార్ మారుతి రెడ్డి ఆదేశించారు. మం గళవారం రోజున గంభీరావుపేట మండల కేంద్రంతోపాటు మండలంలోని సముద్ర లింగాపూర్, కొత్తపల్లి లింగన్నపేట గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి ఐకెపి, పిఎసిఎస్ సెంటర్లను సందర్శించి పలు సూచనలు చేశారు. వేసవి దృశ్య రైతులకు కేంద్రాలలో నీటి సౌకర్యం గన్ని బ్యాగులు తదితర సౌకర్యాలు కల్పించాలని సీసీలకు, సెంటర్ ఇన్చార్జి లకు సూచించారు. తాసిల్దార్ వెంట ఆర్ ఐ ప్రశాంత్ ఆయా గ్రామాల జి. పి. ఓ.తదితరులు ఉన్నారు.

# అంగన్వాడి కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా సంక్షేమ అధికారి



వాస్తవం : ఎల్లారెడ్డిపేట
ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బాలల భద్రత మరియు డ్రగ్ రహిత తెలంగాణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట 7 వ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి లబ్ధిదారులకు గర్భిణీలకు బాలింతలకు ప్రీస్కూల్ పిల్లలకు అందిస్తున్న సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల పరిమాణము, నాణ్యతను పరిశీలించారు. ఆహార పదార్థాలు వాటి నాణ్యతను, పరిమాణాలను పరిశీలించి అంగన్వాడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి లబ్ధిదారు టిఫిన్ బాక్స్ రూపంలో ఇంటికి తీసుకుని వెళ్లకుండా అంగన్వాడీ కేంద్రంలోనే భోజనాలు స్పాట్ ఫీడింగ్ చేయాలని కోరడం జరిగింది.

# మొక్కజొన్న డబ్బులు రైతుల ఖాతాలో వేయాలి

## ఆంక్షలు లేకుండా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి

## బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి



వాస్తవం : హుస్నాబాద్
ఎలాంటి షరతులు లేకుండా రైతులు పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని బీఆర్ఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ లో గల మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమకు గల సమస్యను మల్లికార్జున్ రెడ్డితో విన్నవించుకున్నారు. అనంతరం మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ... వ్యవసాయ మార్కెట్ లోని కొనుగోలు కేంద్రంలో మొక్కజొన్న పంటను అమ్ముకొని 30 రోజులు గడిచినప్పటికీ కూడా డబ్బులు చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. కేవలం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని కొనుగోలు కేంద్రంలో 680 మంది రైతుల దగ్గర 27 వేల క్వింటాళ్ల వరకు మొక్కజొన్నలు కొనుగోలు చేశారని, ఆరున్నర కోట్ల రూపాయల వరకు మొక్కజొన్నలు అమ్ముకున్న రైతులకు డబ్బులు చెల్లించాలని ఉన్నా కూడా సకాలంలో చెల్లించక రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రైతులు మొక్కజొన్న పంటకు పెట్టుబడి పెట్టి, కష్టపడి పండించిన పంటను అమ్ముకుంటే రోజుల తరబడి డబ్బులు చెల్లించకుంటే రైతుల అవసరాలు ఎలా గడుస్తాయి అని ప్రశ్నించారు. రైతుల ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ గొప్పలు చెప్పుకోవడమే తప్ప ఆదుకునే పరిస్థితులు కనబడడం లేదన్నారు. మొక్కజొన్నలు అమ్ముకుందాం అన్న రైతులకు ఎకరానికి 26 క్వింటాళ్ల వరకు మాత్రమే తీసుకుంటామని అధికారులు షరతులు పెడుతున్నారని చెప్పారు. ఒక ఎకరానికి సుమారు 30 క్వింటాళ్ల వరకు పంట పండుతుందని, కానీ అధికారులు షరతులు పెట్టడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మొక్కజొన్న పంటకు ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని అలాగే మొక్కజొన్నల కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# ఉరి వేసుకుని పోస్టుమాస్టర్ మృతి



## ఆర్థిక ఇబ్బందులా? మరి ఏ ఇతర కారణాలా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై నర్సిరెడ్డి

వాస్తవం : చర్ల
అనుమానాస్పద స్థితిలోఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,చర్ల మండలం పెద్దపల్లి పంచాయతీలో రెండు సంవత్సరాలుగా పోస్టుమాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న గోసు. ఉదయ్ కిరణ్ సత్యనారాయణపురం గ్రామంలో అద్దెకు ఉంటున్న నివాసంలో ఉరివేసుకొని మృతి చెందడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్సై. నర్సిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని ఘటన జరిగిన స్థలానికి క్షుణ్ణంగా పరిశీలించి అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చర్ల ప్రభుత్వ హాస్పిటల్ కి తరలించారు. గోసు ఉదయ్ కిరణ్ ఆర్థిక ఇబ్బందులా మరి ఏ ఇతర సమస్యల కారణంతో ఉరి వేసుకున్నాడో తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# జనగణన-2027 శిక్షణ తరగతులు ప్రారంభం



వాస్తవం : తిరుమలగిరి
తిరుమలగిరి మండలంలోని అనంతారం మోడల్ స్కూల్ నందు జనగణన-2027 శిక్షణా కార్యక్రమం తిరుమలగిరి తహసీల్దార్, జనగనన ఇంచార్జి ఆఫీసర్ బాషెట్టి హరిప్రసాద్ అధ్యక్షత సోమవారం ప్రారంభమైంది. ఇట్టి శిక్షణ కార్యక్రమానికి సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 27 నుండి 29 వరకు మూడురోజుల పాటు ప్రతిరోజు ఉదయం 8:00 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు శిక్షణ జరుగుతుందన్నారు. 100% కవరేజ్, 100% ఖచ్చితత్వమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎంపీ ఎస్ ఓ మలోత్ కిషన్, ఫీల్డ్ ట్రైనర్లు కె. అశోక్ రెడ్డి, కె. సత్యనారాయణ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ టి. నరేందర్ లు డిజిటల్ స్క్రీన్ ద్వారా సిబ్బందికి జనగణన యాప్ వినియోగం, హౌస్ లిస్టింగ్, హౌస్ నంబరింగ్, కుటుంబ వివరాల సేకరణపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ తరగతులకు 6 మంది సూపర్‌వైజర్లు, 42 మంది ఎన్యుమరేటర్లు, ఇద్దరు ఫీల్డ్ ట్రైనర్లు మొత్తం 50 మంది సిబ్బంది హాజరయ్యారు.

# బీసీ మహిళలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి శ్రీకారం

## హర్షం వ్యక్తం చేసిన రాజాపూర్ గ్రామ ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్



వాస్తవం : రామగిరి
తెలంగాణ రాష్ట్రంలో మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం శుభ పరిణామమని రాజాపూర్ గ్రామ ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్ తెలిపారు.బీసీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ వేగంగా చర్యలు చేపడుతున్నదని తెలిపారు.ప్రతి నియోజకవర్గం నుంచి సుమారు 1000 మంది అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారని,గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన మహిళలను గుర్తించి వారికి ఉపాధి మార్గాలను చూపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ కుట్టు మిషన్ల ద్వారా మహిళలు ఇంటి వద్ద ను oచే ఉపాధి పొందే అవకాశాలు కలుగుతాయని ,దీని వల్ల స్థిరమైన ఆదాయం పొందగలరని చెప్పారు.ముఖ్యంగా గృహిణులు, నిరు ద్యోగ మహిళలు, చదువులు మధ్యలోనే ఆపిన యువతు లకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు లభించడమే కా కుండా,మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి స్వయం సమృద్ధి దిశగా నడిపించే కీలక అడుగుగా నిలుస్తుందని అన్నా రు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మహిళా సంక్షేమం కోసం తీసుకుంటు న్న చర్యలు రాష్ట్రంలో సామాజిక,ఆర్థిక మార్పులకు దోహదం చేస్తాయని ఉపసర్పంచ్ కలవేన శ్రీకాంత్ ముదిరాజ్ అభిప్రా యపడ్డారు.




# మంకు రాజయ్య సేవలు తీరలేనిలోటు

**ఆంగ్ల మాధ్యమానికి ఆద్యుడు మంకు రాజయ్య**

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర**

**అధికార ప్రతినిధి పర్స హన్మాండ్లు**

**వాస్తవం : కోనరావుపేట**

ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంకు ఆద్యుడు గొప్ప విద్యా సంఘసంస్కర్త మంకు రాజయ్య అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్స హన్మాండ్లు అన్నారు.కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో మంగళవారం మంకు రాజన్న స్మారక విగ్రహం వద్ద ఐదవ వర్ధంతిని ఆయన సహచరులు సహచర ఉద్యమకారులు కలిసి ఘనంగా నిర్వహించారు. మంకు రాజయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పర్స హన్మాండ్లు మాట్లాడుతూ ....మామూలు మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఉపాధ్యాయ వృత్తిలో చేరి మండల విద్యాధికారిగా జాతీయ ఉత్తమ విద్యాధికారి గా ఎదిగిన గొప్ప వ్యక్తి మంకు రాజయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం ద్వారా పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచిన చరిత్ర మంకు రాజయ్య కే దక్కుతుందన్నారు. ప్రజాప్రతినిధుల, విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసి మంకు రాజయ్య తన సత్తా చాటారన్నారు . రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రారంభించడానికి మంకు రాజయ్య ఆలోచననే స్ఫూర్తి అని అప్పటి మంత్రి కేటీఆర్ కొనియాడారని గుర్తు చేశారు.వామపక్ష భావజాలం కలిగి అట్టడుగు, అణగారిన ప్రజల అభ్యున్నతి కొరకు వారి చైతన్యం కొరకు పాటుపడ్డ మహావ్యక్తి మంకు రాజయ్య అని అన్నారు. ఆయన ఒక విద్యా సంఘసంస్కర్తనే గాక తెలంగాణ ఉద్యమకారుడని తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేసి తెలంగాణ సాధనలో క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు, మంకు రాజయ్య లేని లోటు తీరనిదని అన్నారు.ఆయన ఆలోచనలు ఆదర్శాలను భవిష్యత్ తరాలకు అందించే విధంగా సహచర ఉద్యమకారులుగా ముందుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీజీ టిటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు లకావత్ శర్మ నాయక్, నాయకులు సింగం ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ బుర్రా గోపాల్, మైలారం తిరుపతి,కిషన్, గుర్రం దేవదాస్, మధుసూదన్, పంజాల వెంకటేశ్వర్లు, శ్రీధర్, గణేష్, రామదాస్, అమర్, గంగారం, అరుణ్, పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం లబ్ధిదారుల ఆనందం



**వాస్తవం : చేర్యాల**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా చేర్యాల మండలంలో ని ముస్త్యాల గ్రామంలో 11వ వార్డులో అల్లిబిల్లి సరిత సురేష్ కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ చేసారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిల్లాపురం రజిత వరేష్,ఉప సర్పంచ్ బైకని కమలాకర్, 11వ వార్డు సభ్యులు సొంటే ప్రవంతి కిరణ్ తో పాటు గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు. లబ్ధిదారులను ఆశీర్వదించి నూతన గృహంలోకి ఆహ్వానించారు.లబ్ధిదారులు సరిత సురేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజుల్లోనే రేషన్ కార్డు ఇచ్చి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వంనెరవేరుస్తోందని కృతజ్ఞతలు తెలిపారు.

# హుస్నాబాద్‌లో హ్యాండ్ బాల్ శిక్షణ శిబిరం

**వాస్తవం : హుస్నాబాద్**

హుస్నాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ అథారిటీ సిద్దిపేట జిల్లా ( డిఎస్ఏ) వారి ఆధ్వర్యంలో హ్యాండ్ బాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కోచ్ జి. రిశ్వంత్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనే క్రీడాకారులు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ చేసుకొని (పెద్ద బడి) జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హుస్నాబాద్ మైదానంలో రిపోర్ట్ చేయాలని తెలియజేశారు. కోచింగ్ క్యాంప్ ఉదయం గం. 6:30 నుండి ఉదయం గం. 8:00 వరకు మరియు సాయంత్రం గం.4:00 నుండి గం.6:00 వరకు కొనసాగుతుందని తెలియజేశారు. కావున విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9347017820 నంబర్ లో సంప్రదించాలని తెలియజేశారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే

**వాస్తవం : జూబ్లీహిల్స్**

శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఈ సందర్భంగా ప్రజలకు మినరల్ వాటర్, గ్లూకోన్-డి, బటర్ మిల్క్ అందుబాటులో ఉంచి ఉచితంగా పంపిణీ చేస్తున్న శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల్ని అభినందించారు. ఈ సందర్భంగా వి.నవీన్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం స్థాపించడం అభినందనీయమని అన్నారు.




ఈ కార్యక్రమంలో శ్రీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు, పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**వ్యవసాయ అధికారులు, పోలీసులు**

**సంయుక్తంగా తనిఖీలు చేయాలి**

**ఎవరైనా పట్టుబడితే కేసులు నమోదు చేయాలి**

**సన్న వడ్లు, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంచాలి**

**ఫార్మర్స్ రిజిస్ట్రీ పూర్తి చేయాలి**

**ఖరీఫ్ సీజన్ కు వ్యవసాయ, ఉద్యానవన, సహకార**

**శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్కడైనా నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హెచ్చరించారు.రానున్న ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో నకిలీ విత్తనాల నియంత్రణ, సన్న వడ్ల, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపు, ఫార్మర్స్ రిజిస్ట్రీ పూర్తి తదితర అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన, సహకార, పోలీస్ శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన సన్న వడ్ల రకాలు, ఆయిల్ పామ్ సాగు పూర్తి వివరాలతో రూపొందించిన కరపత్రాలను జిల్లా కలెక్టర్, అధికారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ....జిల్లాలో ఎక్కడా ఏ విధమైన నకిలీ విత్తనాలు విక్రయాలు, కంపెనీ వివరాలు లేకుండా విడిగా విత్తనాల అమ్మకాలు చేయకుండా వ్యవసాయ, పోలీస్ శాఖ సంయుక్తంగా దాడులు చేయాలని, ఏమైనా విక్రయాలు ఉంటే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నేరుగా వచ్చి విత్తనాలు విక్రయించే వారి వద్ద రైతులు తీసుకోవద్దని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఫార్మర్స్ రిజిస్ట్రీ ఇప్పటిదాకా 73 శాతం పూర్తి చేశారని వెల్లడించారు. వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాలు, రైతులను నేరుగా కలిసి ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సన్న వడ్లు సాగు విస్తీర్ణం పెంచాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాప్ లు, రెసిడెన్షియల్ విద్యాలయాలు, మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. అలాగే రూ. 500 బోనస్ కూడా ఇస్తుందని వెల్లడించారు. జిల్లాలోని రైతులు సన్నవడ్లు సాగు చేసేలా.. యాజమాన్య పద్ధతులు తెలిపి ప్రోత్సహించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు.ఆయిల్ పామ్ పంట సాగు ద్వారా అధిక దిగుబడితో పాటు దీర్ఘకాలంపాటు అధిక ఆదాయాన్ని పొందవచ్చని, పంట సాగుకు రైతులు ముందుకు వచ్చేలా వివరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఆసక్తి ఉన్న రైతులను వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు నేరుగా కలిసి మాట్లాడాలని ఆదేశించారు. ఉద్యానవన శాఖ అధికారులకు 500 ఎకరాలు, మండల వ్యవసాయ అధికారులకు 50, ఏఈఓ లకు 30, ప్రతి పీఏసీఎస్ బాధ్యులు 120 ఎకరాల చొప్పున లక్ష్యంగా నిర్ణయించి.. ఆయిల్ పామ్ సాగుకు రైతులు డీడీలు చెల్లించేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటికే చెల్లించిన వారికి డ్రిప్ ఇరిగేషన్, మొక్కలు అందజేసి నాటించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





# దాహార్తిని తీరుస్తున్న దాత వివేక్ వెంకటస్వామి

## నీటి సమస్య చెప్పగానే.. అడిగిందే తడవుగా.. 2 బోర్ వెల్స్ మంజూరు



వాస్తవం : మందమర్రి

మందమర్రి మండలంలోని చిర్రకుంట గ్రామంలో నీటి సమస్య తీవ్రత ఉన్నదని స్థానిక మంత్రివర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లగా.. మంత్రి వెంటనే స్పందించి. చిర్రకుంట గ్రామానికి రెండు బోర్ వెల్స్ మంజూరు చేశారు. బోర్ వెల్స్ పనులను మంగళవారం గ్రామ ప్రజల సమక్షంలో.. స్థానిక సర్పంచ్ రామ టెంకి శ్రీలత ఉ తిరుపతి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్ లు టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా.. వారు మాట్లాడుతూ.. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి మిషన్ భగీరథ పేరుతో పైపులైన్లు వేశారు కానీ.. నీళ్లు అందించే ప్రయత్నం చేయలేదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పల్లెలలో ఎంపీ లార్డ్స్ ద్వారా గాని, విశాఖ ట్రస్ట్ ద్వారా గాని వేసిన బోర్వెల్స్ తప్ప, గత పది సంవత్సరాలలో ఒక బోర్వెల్ వేసిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే బడుగు బలహీన వర్గాల ప్రభుత్వం అని కొనియాడారు. ఈ సందర్భంగా.. మంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో.. ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ పంచాయతీ కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ నాయకులు జనార్దన్, సంపత్ రావు, సుధాకర్, సాయి ,రమేష్, రాజేందర్. రాజశేఖర్ ,శ్యామెందర్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్‌కు వినూత్న రీతిలో బీఆర్ఎస్ పాలాభిషేకం

-వితంతు పెన్షన్ విడుదల చేయాలని డిమాండ్

-16వ కార్పొరేటర్ సుంకరి మనిషా -శివకుమార్



వాస్తవం : వరంగల్ ప్రతినిధి:

పెండింగ్‌లో ఉన్న వితంతువుల పెన్షన్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి వినూత్న రీతిలో పాలాభిషేకం చేశారు. 16వ డివిజన్ ధర్మారం గ్రామ పంచాయతీ వద్ద కార్పొరేటర్ సుంకరి మనిషా – శివకుమార్ వితంతువులతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో వితంతువులకు 4 వేల రూపాయల పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చి మోసం చేసిందని మండిపడ్డారు. గ్రేటర్ వరంగల్‌లో ఇప్పటి వరకు 1500 మంది వితంతువులకు పెన్షన్ మంజూరైనా బడ్జెట్ కేటాయించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు పెన్షన్ చేతికి అందకపోవడంతో వితంతువులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన 2 వేల రూపాయల పెన్షన్‌నైనా వెంటనే వితంతువులకు అందజేయాలని డిమాండ్ చేశారు.

# ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా ఉండాలి

**తాగునీటి సరఫరా మెరుగుపరచాలి**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**వాస్తవం, ఎల్కతుర్తి, ఏప్రిల్ 28:**

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరైన అవగాహన కల్పించాలని, కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేంద్రాన్ని వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పర్యవేక్షిస్తూ సమస్యలు వెంటనే పరిష్కరించేలా చూడాలని తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట బావులను అద్దెకు తీసుకొని నీటి సరఫరా చేయాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి..**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఇసుక కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జూన్ 2 నాటికి అధిక సంఖ్యలో గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని, డ్రాప్‌అవుట్స్ లేకుండా చూడాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని పేర్కొన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ముక్కల నాటేందుకు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

**ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి...**

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, దీని ద్వారా లభించే లాభాలను వివరించాలని ఉద్యాన శాఖ అధికారులకు మంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అవసరమైన చోట చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ చానళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ మహిళా సంఘాలకు స్టీల్ ప్లేట్లు, గ్లాసులు వినియోగంలోకి తేవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



వాస్తవం : మంథని :

మంథని మండలం గుమ్మునూర్ రెండవ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాలలో భాగంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ కళావతి ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ ప్రజలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే ఆకట్టుకున్నాయి. అంగన్వాడి కేంద్రంలో ప్రీ–స్కూల్ విద్యను పూర్తిచేసుకున్న చిన్నారులకు గుర్తింపుగా కార్యక్రమం నిర్వహించి, వారికి ప్రోత్సాహం కల్పించారు. అలాగే గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారం అవసరంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన ఆహారం, పోషకాహార ప్రాముఖ్యత, తల్లి-శిశు ఆరోగ్యం కోసం పాటించాల్సిన సూచనలను వివరించారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా గ్రామ మహిళల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించేందుకు కృషి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాళ్లు సుంకరి మాధవి, బందెల సునిత, ఆశవర్కర్ బందెల హేమలత, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

# యువత భద్రతే లక్ష్యం

**గోదావరిఖనిలో చైల్డ్ సేఫ్టీ అవగాహన**



**వాస్తవం : గోదావరిఖని ఏప్రిల్ 28:**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చైల్డ్ సేఫ్టీ,మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం యువతలో చైతన్యం కల్పించేందుకు ప్రత్యేకంగా ఆకర్షించింది. కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనా రెడ్డి పర్యవేక్షణలో సబ్‌ఇన్‌స్పెక్టర్ అనూష విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలను వివరించడంతో పాటు,విద్యా భవిష్యత్తుపై వాటి ప్రభావాన్ని స్పష్టంగా వివరించారు. డ్రగ్స్ అలవాటు యువతను చీకటి మార్గంలోకి నడిపిస్తుందని,అలాంటి అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంలో ప్రతి విద్యార్థి పాత్ర కీలకమని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినప్పుడు వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మంచి స్నేహితులను ఎంచుకోవడం,సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలని మార్గనిర్దేశం చేశారు.

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం:॥ 9618616110